

అటు రాజ్యాంగ నిర్మాత సూక్తులు...
ఇటు గౌతమబుద్ధుని హితోక్తులు

# నగరంలో పలుచోట్ల వర్షం

## -ఉక్కపోత నుంచి ఉపశమనం

**హైదరాబాద్, ఏప్రిల్ 13,ప్రభాతవార్త:**

హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో గురువారం సాయంత్రం వర్షం కురిసింది. జగద్గిరిగుట్ట, చింతల్,బాలానగర్, చంపాపేట్, సరూర్‌నగర్, చైతన్యపురిలో వానపడింది. సైదాబాద్ పరిసర ప్రాంతాల్లో పడగండ్ల వాన కురవగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. బోయినపల్లి ,తిరుమల గిరి, అల్వాల్, బొల్లారం, ప్యాట్నీ ప్యారడైజ్,బేగంపేట్, చిలకలగూడ, మారేడుపల్లితోపాటు పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. గాలులతో హైకోర్టు సమీపంలో చెట్టు నేలకొరిగింది. దాంతో ముగ్గురికి గాయాలయ్యాయి. సిటీ కాలేజీ వెనుకాల రోడ్డుపై చెట్టుకూలడంతో భారీగా ట్రాఫిక జామ్ అయ్యింది. పొద్దంతా ఎండలు దంచికొట్టి దాదాపు 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. సాయంత్రం ఒక్కసారిగా ఈదురు గాలులతో వర్షం కురువడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. దాంతో జనమంతా ఎండవేడి నుంచి ఉపశమనం కలిగింది. ,

# పాఠశాల స్థాయి నుంచే నాయకత్వ లక్షణాలు మెరుగుపర్చుకోవాలి

## -కమాండర్ సునీల్ కుమార్

**నాచారం, ఏప్రిల్ 13 ప్రభాతవార్త:**

పాఠశాల స్థాయి నుంచే విధ్యార్థులు నాయకత్వ లక్షణాలను మెరుగు పర్చుకోవాలని నేవి కమాండర్ సునిల్ కుమార్ సూచించారు. పల్లవిమోడల్ ఆద్వర్యంలో వివిద రంగాలకు ఎన్నికైనా విధ్యార్థుల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన నేవి కమాండర్ సునిల్ కుమార్ మాట్లాడుతూ విధ్యార్థులకు బాల్యం నుంచే పల్లవిమోడల్ స్కూల్స్, డిపీఎస్ స్కూల్స్‌లల్లో వివిద రంగాల్లో శిక్షణనివ్వడం వారి భవిష్యత్‌కు ఎంతో మేలు చేస్తుందన్నారు. ఇలాంటి నాయకత్వ లక్షణాలను అలవర్చుకునేలా చేసే కార్యక్రమాలు చేయడం పట్ల యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ ఎం.కొమురయ్య, ప్రిన్సిపల్ శైలజా రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డైరెక్టర్, సీసిఎ కోఆర్డినేటర్ నాగలక్ష్మితో పాటు పలువురు విధ్యార్థులు పాల్గొన్నారు.



# హైదరాబాద్ వార్త

# నగరానికి శబ్ధం ముప్పు

## -అత్యధిక స్థాయిలో సౌండ్ పొల్యూషన్ -నగరవాసుల ఆరోగ్యంపై దుష్ప్రభావం

**హైదరాబాద్, ఏప్రిల్ 13 ప్రభాతవార్త**

శబ్ధ కాలుష్యంతో నగరంలో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. శబ్ధ కాలుష్యం మోతమోగుతుంది. దీనివల్ల అనేక రకాలైన సమస్యలు ఏర్పడుతున్నాయంటూ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రేటర్‌లో సుమారు 200 ప్రధాన ట్రాఫిక్ జంక్షన్లున్నాయి. ట్రాఫిక్ సిగ్నల్స్‌తో వీటి దగ్గర అధిక సమయం వాహనాలు నిలపాల్సి రావడంతో హారన్ల మోత మోగుతోంది. నగరంలో ఇంటి నుంచి బయటకు వెళ్లలేనిదే రోజు గడవని పరిస్థితి.ఉద్యోగులైతే రోడ్ల మీదే 2-4 గంటల పాటు గడుపుతుంటారు. ఇతరులు సైతం నిత్యం రోడ్ల మీదకు వచ్చి వెళుతూ 2-3గంటలు బయట తిరుగుతుంటారు. వీరందరికీ నగరంలో పెరిగిన శబ్ధ కాలుష్యంతో ముప్పు పొంచి ఉందనే విషయాన్ని పర్యావరణ వేత్తలు, వైద్యులు చెబుతున్నారు.వ్యాపార వాణిజ్య కేంద్రాలతోపాటు నివాస ప్రాంతాల్లోనూ శబ్ధ కాలుష్య నియంత్రణ అమల్లో ఉన్నా..దానిని ఎవరూ పాటించకపోవడం వల్లే ఈ ముప్పు ముంచుకొస్తోంది.ఇందులో భాగంగా హైదరాబాద్ నగర పరిధిలో అనేక ప్రాంతాల్లో దీనికి సంబంధించి పరిణామాలను ప్రత్యేక పరికరాల ద్వారా లెక్కించి అన్ని చోట్ల పెరుగుతుందని రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు తేల్చింది. తెలంగాణ రాష్ట్ర రాజధాని రోడ్లపై నిత్యం 50 లక్షల నుంచి 60 లక్షల వాహనాలు తిరుగుతున్నాయని పోలీసులు చెబుతున్నారు. రావాణా శాఖ నిబంధనల ప్రకారం 15 ఏళ్లు దాటిన రవాణా వాహనాలను అధికారులు నియంత్రించాల్సి ఉంది. కాలం తీరిన వాహనాలను నియంత్రించడంలో అధికారులు ఘోరంగా విఫలమవుతున్నారు. ఆర్టిసికి చెందిన దాదాపు 1000 డొక్కు బస్సులు, వేలాది పాత రవాణా వాహనాలు, కార్లు రోడ్లపై పరుగులు పెడుతున్నాయి. వీటి వల్ల పెద్ద ఎత్తున శబ్ధ కాలుష్యం వెలువడుతుంది. యూత్ ప్రత్యేక గుర్తింపు కోసం అధిక శబ్ధాలు వెలువడే మోడిఫైడ్ హారన్లను వినియోగిస్తుండడంతో శబ్ధ కాలుష్యం పెరుగుతోంది.

**ఎక్కడెక్కడ ఎలా ఉంది.....**

సున్నిత ప్రాంతాలైన జూపార్కు, గచ్చిబౌలిలో పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. జూపార్కు దగ్గర నిర్ధేశిత పరిమితుల కంటే పగటిపూట అధిక శబ్ధం నమోదైంది. ఇక్కడ పగటిపూట 50 డిసిబుల్స్ ఉండాలి కానీ 69శాతం ఉంది. రాత్రిపూట 45 డిసిబుల్స్ ఉండాల్సి ఉండగా 68.1శాతం ఉంది. నివాస ప్రాంతాలైన జుబ్లీహిల్స్, తార్నాకలో మోత మోగుతోంది. అబిడ్స్‌లో నిర్ధేశిత పరిమితుల కంటే అధికంగా నమోదైంది. కంటికి కనిపించని ముప్పు ముందుకొస్తుంది. గాలి పీల్చగానే నేరుగా ఊపిరితిత్తుల్లోకి చేరి అక్కడే స్థిరపడి అనారోగ్య సమస్యలకు కారణమయ్యే అతి సూక్ష్మ ధూళి కణాలు నగరాన్ని ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. వీటి తీవ్రత కొన్ని ప్రాంతాల్లో ప్రమాదకరంగా ఉన్నట్లు వెల్లడయ్యింది. వాహనాలు, రోడ్లు, చెత్తను కాల్చడం, నిర్మాణ పనులు తదితర కార్యకలాపాల వల్ల గాల్లోకి నిత్యం నైట్రోజన్ ఆక్సైడ్లు, కార్బన్‌మోనాక్సైడ్ తదితర 40 రకాల కాలుష్య ఉద్గారాలు విడుదలవుతున్నాయి. మన తల వెంట్రుక మందం 50 మైక్రోగ్రాములు ఉంటే, అదే పీఎం 2.5 విషయానికొస్తే అందులో 20 రెట్లు తక్కువగా ఉంటుంది. అత్యంత ప్రమాదకంమైనది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి నిర్ధేశిత పరిమితుల ప్రకారం ఘనపు మీటర్ గాలిలో దీని తీవ్రత 40 మైక్రోగ్రాములు మించరాదు.నగరంలో పలు ప్రాంతాల్లోని పీసీబీ కాలుష్య నమోదు కేంద్రాల్లో ఈ ఏడాదిలో ఇప్పటి వరకు పీఎం 2.5 తీవ్రత ఎలా ఉందంటూ లెక్క తీయగా చాలాచోట్ల నిర్ధేశిత మార్కు కంటే అధికంగా నమోదైనట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. అత్యధికంగా సనత్‌నగర్‌లో 77 ఎంజీలు నమోదైనట్లు గుర్తించారు. జూపార్కు దగ్గర 72 ఎంజీలు, హెచ్‌సీయూ, జీడిమెట్లలో 51 ఎంజీలు, ఫ్యారడైజ్‌లో 39 ఎంజీలుగా ఉంది.

**శబ్ధ కాలుష్యానికి కారణాలు..**

-ఈ వాతావరణంలో ఎక్కువసేపు ఉంటే బిపి పెరగడం, వినికిడి లోపం, మానసిక సమస్యలు తలెత్తే ప్రమాదముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

-సరుకుల్ని మోసుకొచ్చే భారీ వాహనాలు, ట్రావెల్స్, బస్సుల రాకపోకలు రాత్రిపూటే ఎక్కువగా ఉంటాయి. వీటి హారన్‌ల మోతతోనే శబ్ధ కాలుష్యం ఎక్కువగా నమోదవుతున్నట్లు పీసీబీ శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు.

-నగరంలో శబ్ధ కాలుష్యానికి రవాణ వాహనాలు, పరిశ్రమలు, నిర్మాణరంగ కార్యకలాపాలు, లౌడ్ స్పీకర్లు, డీజే హోరు తదితర అంశాలు ప్రధాన కారణాలు.

-భారీ ట్రక్కులు, వాహనాల డ్రైవర్లు నిరంతరాయంగా హారన్ల మోత మెగిస్తుండడం.

-గ్రేటర్‌లో నిర్మాణ రంగం శరవేగంగా విస్తరిస్తుండడంతో బోరుబావుల తవ్వకం, లోడర్లు, డంపర్లు లాంటి కాంక్రీట్ మిక్సింగ్ యంత్రాల వినియోగం పెరిగింది. వీటి నుంచి అధిక శబ్ధాలు వెలువడుతున్నాయి.

## నివారణ చర్యలు..

-ప్రధానంగా ఆసుపత్రులు, పాఠశాలల గోడలను అధిక శబ్ధాలను నిరోధించే జిప్సం బోర్డులు, ఫైబర్ గ్లాస్ ఇన్సులేషన్స్‌తో కప్పి వేస్తే ధ్వని లోపలికి చేరకుండా ఉంటుంది.

-అధిక శబ్ధాలు వెలువడే ప్రాంతాల్లోని భవనాలకు విధిగా శబ్ధ గ్రాహకాలు ఏర్పాటు చేయాలి.

-ప్రతి ఆస్పత్రి, పాఠశాల ఆవరణలో గ్రీన్ బెల్ట్‌ను అధికంగా ఏర్పాటు చేయాలి. అధిక శబ్ధాలను గ్రహించేందుకు హరిత వాతావరణం దోహదం చేస్తుందని గుర్తించాలి. గ్రీన్ బిల్డింగ్‌ల నిర్మాణాలను ప్రోత్సహించాలి.

-ఏ వ్యక్తి అయినా 8 గంటల పాటు 85 డెసిబెల్స్‌కు మించిన శబ్ధం వినకుండా జాగ్రత్తలు పాటించాలి.

-అత్యధిక శబ్దాలు వినిపించే ప్రాంతాల్లో ఇయరింగ్ ప్లగ్‌లు వాడాలి.

-ట్రాఫిక్ రద్దీలో బయటకు వెళ్లేటప్పుడు హెల్మెట్‌లు, చెవుల్లో దూది పెట్టుకోవాలి.

# కొనసాగుతున్న భ్రూణహత్యలు

**-గ్రేటర్‌లో యథేచ్ఛగా లింగనిర్ధారణ పరీక్షలు**
**-పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో గుట్టుగా సాగుతున్న దందా**
**-ఆర్‌ఎంపీ, పీఎంపీల ద్వారా రూ.వేలల్లో వసూళ్లు**
**-చూసిచూడనట్లుగా వ్యవహరిస్తున్న వైద్యాధికారులు**



**హైదరాబాద్, ఏప్రిల్ 13,ప్రభాతవార్త:**

ఇటీవల హాయత్‌నగర్‌కు చెందిన మూడు నెలల గర్భిణీ తనకు పుట్టబోయేది మగబిడ్డనో..ఆడబిడ్డనో..అనే విషయం తెలుసుకునేందుకు మలక్‌పేట్‌లోని ఓప్రైవేట్ ఆసుపత్రిలో లింగనిర్ధారణ పరీక్షలు చేయించుకుంది. ఇలా నెలనెల సదరు గర్భిణీ ఆసుపత్రి వస్తూ స్కానింగ్ చేసుకున్నప్పుడు సదరు వైద్యురాలు,స్కానింగ్ సెంటర్ నిర్వాహకుడు సైతం పుట్టబోయేది మగబిడ్డ అంటూ నమ్మబలుకుతూ నెలనెలా డబ్బులు వసూలు చేశారు. తీరా ఆమెకు ఆడబిడ్డ పుట్టడంతో బాధితులు మోసపోయామని తెలుసుకున్నారు. ఇదీ గ్రేటర్‌లోని పలు స్కానింగ్ సెంటర్లలో నిబంధనలకు విరుద్ధంగా లింగనిర్ధారణ పరీక్షల దందా జోరుగా సాగుతుంది.దర్జాగా సాగుతున్న ఈదందాను నియంత్రించాల్సిన వైద్యఆరోగ్యశాఖ చూసీచూడనట్లుగా వ్యవహరిస్తుంది. లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే సదరు అసుపత్రి,స్కానింగ్ సెంటర్‌ను సీజ్ చేయడంతోపాటు, వైద్యపట్టాను రద్దు చేయడం,జైలు శిక్ష విధించడం వంటి కఠిన నిబంధనలు ఉన్నాయి. కానీ కొందరు వైద్యులు ధనార్జనే ధ్యేయంగా చట్టాలను అతిక్రమిస్తున్నారు.మగవారికి ఏమాత్రం తీసిపోని విధంగా అడపిల్లలు అన్నిరంగాలో రాణిస్తున్నప్పటికీ వారి పట్ల ఇప్పటికీ వివక్ష కొనసాగుతూనే ఉంది. మహిళ గర్భం దాల్చిన తర్వాత పుట్టబోయేది ఆడ,మగ తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.ఇదీ చట్ట రిత్యానేరం అని తెలిసినా కొన్ని స్కానింగ్ సెంటర్లు నిబంధనలు తుంగలో తొక్కుతున్నాయి.

గ్రేటర్ వ్యాప్తంగా సుమారుగా 1500 పైగా స్కానింగ్ కేంద్రాలు ఉన్నట్లు అంచనా. నగర శివారు ప్రాంతాల్లోనైతే ఎక్కడ పడితే అక్కడా ఈ కేంద్రాలు వెలసినాయి. స్కానింగ్ కేంద్రాలపై అధికారుల నియంత్రణ లేదు. దీంతో స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. డబ్బులిస్తే చాలు కడుపులో ఉన్నది ఆడ,మగ అని చెప్పేస్తున్నారు. ఇతర జిల్లాలల నుంచి వచ్చిమరీ నగరంలో గర్భస్థ లింగనిర్ధారణ చేసుకుంటున్న పరిస్థితి. గ్రేటర్‌లో దాదాపుగా నెలకు 30 వేల మంది గర్భిణీలు స్కానింగ్ తీయించుకుంటున్నారు.ఒక్కొక్కరి నుంచి రెండు నుంచి ఎనిమిది వేలవరకువసూలు చేస్తున్నారు.

**అమలుకు నోచుకోని చట్టం...**

లింగనిర్ధారణ,భ్రూణహత్యలను నివారించేందుకు ఉద్దేశించిన పిసిపిఎన్‌డిటీ చట్టం అభాసుపాలవుతుంది. ఈచట్టం ఉన్నట్లు ఆయా స్కానింగ్ కేంద్రాల్లో పోస్టర్లు అతికించి,లోపల మాత్రం యథేచ్ఛగా లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. ఈచట్టం ఏర్పడి 27ఏళ్లు అవుతుంది. దీనిని ఉల్లంఘిస్తే భారీ జరిమానాలతోపాటు జైలుశిక్ష పడుతుంది. కానీ ఇప్పటివకు ఏఒక ్కరు జైలుగడప కాదుగకదా కోర్టు మెట్లు ఎక్కలేదు. దీన్ని బట్టి వైద్యఆరోగ్యశాఖ అధికారులు పనితీరు ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

**ఎలాంటి శిక్ష విధిస్తారు..**

నిబంధనలకు విరుద్ధంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేసిన వైద్యుడితో పాటు సిబ్బందికి మూడేళ్లు జైలుశిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తారు. అదే నేరాన్ని మళ్ళీ చేస్తే ఐదళ్లవరకు జైలు,రూ.50వేల జరిమానా విధించే అవకాశం ఉంది. వైద్యులు జైలుశిక్ష అనుభవిస్తే వారిగుర్తింపును రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ నుంచి రెండేళ్ల వరకు రద్దు చేస్తారు. వైద్యులు మరోచోట వైద్యవృత్తిని చేపట్టేందుకు వీలుండదు. రెండోసారి శిక్షపడితే మెడికల కౌన్సిల్ రిజిస్టర్ నుంచి పేరును శాశ్వతంగా తొలగిస్తారు. అలాగే గర్భిణీకి ఇష్టం లేకుండా గర్భస్రావం చేస్తే బాధ్యులైన వారికి జీవితకాలం శిక్ష,జరిమానా విధించే అవకాశం ఉంది.

# నేడు అంబేద్కర్ విగ్రహావిష్కరణ..ఏడు గంటలపాటు ట్రాఫిక్ ఆంక్షలు

**హైదరాబాద్, ఏప్రిల్ 13 ప్రభాతవార్త**

దేశంలోనే అతిపెద్ద అంబేద్కర్ విగ్రహావిష్కరణకు నగరం వేదిక కానుంది.శుక్రవారం అంబేద్కర్ జయంతి సందర్భంగా సిఎం కెసిఆర్ చేతుల మీదుగా అంబేద్కర్ మనువడు ప్రకాష్ ముఖ్యఅతిథిగా ఈ కార్యక్రమం జరగనుంది. అయితే విగ్రహావిష్కరణ సందర్భంగా నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు ప్రకటించారు పోలీసులు.శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి 8 గంటల వరకు ట్యాంక్‌బండ్ పరిసర ప్రాంతాల్లో ఆంక్షలు అమలు చేయనున్నారు. దీంతో వాహనాల దారి మళ్లింపు ఉండనుంది. నెక్సెస్ రోడ్డు, ఖైరతాబాద్, లక్డీకాపూల్, తెలుగుతల్లి జంక్షన్ రహదారుల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమలు కానున్నాయి.ట్రాఫిక్ ఆంక్షల కారణంగా ఖైరతాబాద్, సైఫాబాద్, రవీంద్రభారతి, మింట్‌కంపౌండ్, నల్లగుట్ట, లోయర్ ట్యాంక్‌బండ్, లిబర్టీ, తెలుగుతల్లి సిగ్నల్ల వద్ద భారీ వాహనాల రద్దీ ఉండే అవకాశం. ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని వాహనదారులకు సూచిస్తున్నారు ట్రాఫిక్ పోలీసులు. ఇందుకోసం హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసుల సోషల్ మీడియా అకౌంట్లను ఫాలో కావాలని నెటిజన్స్‌కు సూచిస్తున్నారు. ఏదైనా అత్యవసరం ఉంటే ట్రాఫిక్ కంట్రోల్ హెల్ప్ నెంబర్ 9010203626కు ఫోన్ చేయాలని పోలీసులు కోరుతున్నారు.

-నెక్లెస్ రోడ్డు-ఎన్టీఆర్ మార్గ్-తెలుగు తల్లి జంక్షన్ వైపు వాహనాలకు నో ఎంట్రీ.

-పంజాగుట్ట, సోమాజీగూడ, ఖైరతాబాద్ నుంచి నెక్లెస్ రోడ్ వైపు వెళ్లే వాహనాలు షాదన్ కళాశాల మీదుగా దారి మళ్లింపు.

-సంజీవయ్య పార్కు, నెక్లెస్ రోడ్డు నుంచి ఎన్టీఆర్ మార్గ్, ఖైరతాబాద్ వైపు వెళ్లే వాహనాలు రాణిగంజ్ మీదుగా తరలింపు.

-లక్డీకాపూల్ నుంచి ట్యాంకుబండ్, లిబర్టీ వైపు వెళ్లే వాహనాలు తెలుగుతల్లి ఫ్లైఓవర్, లోయర్ ట్యాంక్ బండ్ వైపు మళ్లింపు

-ట్యాంక్‌బండ్, బీఆర్కేభవన్, తెలుగుతల్లి జంక్షన్ మీదుగా ఎన్టీఆరన మార్గ్ వైపు వచ్చే వాహనాలు లక్డీకాపూల్ వైపు మళ్లింపు.

-మింట్ కౌంపౌండ్, నెక్లెస్ రోటరీ మార్గాల మూసివేత.

# సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## రాచకొండ పోలిస్ కమిషనర్ డి.ఎస్ చౌహాన్..

**నేరెడ్‌మెట్ ఎప్రిల్13 ప్రభాతవార్త:** సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉంటూ మోసపోకుండా పలు జాగ్రత్తలు పాటించాలని రాచకొండ పోలిస్ కమీషనర్ డి.ఎస్ చౌహాన్ పేర్కొన్నారు. గురువారం రాచకొండ పోలిస్ కమీషనరేట్ కార్యాలయంలో సైబర్‌క్రైమ్, క్రైమ్ విభాగ అధికారులు, సిబ్బందితో అయన సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ ప్రస్తుతం యావత్ దేశం సాంకేతిక పరికరాలను వాడడం జరుగుతుందన్నారు. వివిధ రకాల అవసరాలకు అనుగూణంగా సాంకేతిక పరికరాల వాడకం తప్పనిసరి అయ్యిందన్నారు. కానే దాన్నే అదనుగా భావించిన కొంతమంది నేరగాళ్ళు అమాయక ప్రజలను సైబర్‌క్రైమ్‌లను గురి చేయడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం ప్రతి ఒక్కరికి సైబర్‌క్రైమ్‌పై అవగాహన ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రజల్లో సైబర్‌నేరాలపై అవగాహన పెరిగేలా కళాశాలలు, ప్రభుత్వ,ప్రైవేటు కార్యాలయాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. నకిలీ లాటరీ, ఉద్యోగ ప్రకటన, బ్యాంకు అకౌంట్ సమాచారం, బహుమతులు వంటి పేర్లతో ప్రజలను మోసం చేస్తూ వారి వద్ద నుండి భారీ మొత్తంలో నగదు దోచుకుంటున్నారని తెలిపారు. చైన్‌సా న్చర్ల బెడద తప్పింది.. పోలీసుల కృషి, కఠిన చర్యల వల్ల రాచకొండ పోలిస్ కమీష నరేట్ పరిధిలో చైన్‌స్నాచర్ల బెడద దాదాపు తగ్గిందన్నారు. మహిళలు ప్రశాంతగా బయటకు వెళ్ళి పనులు చేసుకుంటున్నారని తెలిపారు. చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నేరాలు తగ్గుముఖం పట్టేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసిపి సైబర్‌క్రైమ్ అనురాధ, మధుకర్ స్వామి, ఏసిపి వెంకటేశం, సీఐలు, ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.



రాచకొండ పోలిస్ కమీషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న రాచకొండ సిపి డి.ఎస్ చౌహాన్

# సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందిస్తున్న జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్..

**జవహర్‌నగర్ ఎప్రిల్13 ప్రభాతవార్త:**

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం లాంటిందని జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 8వ డివిజన్ సంతోష్ నగర్‌లో నివాసముండే శర్బానా అనే లబ్దిదారుడికి గురువారం బాలాజీనగర్‌లోని కార్యాయంలో సీఎం రిలీఫ్ ఫండ్ రూ. 60వేల చెక్కును అందించారు. అనంతరం అయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ హయాంలో పేదలకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. పేదలకు అండగా టిఆర్‌ఎస్ ప్రభుత్వం నిలుస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నో నూతన పధకాలను ప్రవేశపెట్టి దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అదర్శంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రంగ శ్రీమన్నారాయణ, కంటి వెంకటేష్, రమణప్ప, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# బిసిబిల్లు..ప్రత్యేక మంత్రిత్వశాఖకై కేంద్రంపై ఒత్తిడి తెస్తున్నాం

**-రాష్ట్రపతి,ఉపరాష్ట్రపతి ,హోంమంత్రిని కలిసి బిసిల పరిస్థితి వివరించాం**
**-బిసి సంక్షేమసంఘం జాతీయాఅధ్యక్షులు ఎంపి.ఆర్.కృష్ణయ్య**



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య, గుజ్జకృష్ణ తదితరులు

**హైదరాబాద్,ఏప్రిల్ 13,ప్రభాతవార్త:**

పార్లమెంట్‌లో బిసిబిల్లు పెట్టి చట్టసభలల్లో బిసిలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని, బిసిలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేసి ఏటా 2లక్షల కోట్లు బడ్జెట్ కేటాయించాలని గత నెలరోజులుగా రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ,హోంశాఖమంత్రితోపాటు ప్రతిపక్ష నేతలతో చర్చలు జరిపి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తున్నామని బిసి సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షులు ఎంపి.ఆర్.కృష్ణయ్య తెలిపారు. ఈమేరకు గురువారం కాచిగూడలో జాతీయ కన్వీనర్ గుజ్జకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కృష్ణయ్య మాట్లాడుతూ కేంద్రస్థాయిలో కాలేజీ, పాఠశాలల విద్యార్థుకు స్కాలర్‌షిప్ ప్రవేశపెట్టాలని ,ఫీజుల రియంబర్స్‌మెంట్ ,హాస్టళ్లు, గురుకుల పాఠశాలలను మంజూరు చేయాలని ,కులవృత్తులను కోల్పోయిన ప్రతి కుటుంబానికి 20లక్షల సబ్సిడీ రుణాలు మంజూరు చేసి ఆదుకోవాలని తదితర 16డిమాండ్లతో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీష్‌దనకర్, హోంమంత్రి అమిత్‌షా, కాంగ్రేస్‌అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, సిపిఐ నేత ఏచూరి, సమాజ్‌వాది అధ్యక్షులు అఖిలేష్ యాదవ్, డిఎస్‌పి, డిఎంకె, అన్నాడిఎంకే, ఆమ్ ఆద్మీ, జనతాదల్ తదితర అన్ని పార్టీల నేతలను కలిసి బిసిలకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించామన్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్ ,బిహార్ ఒరిస్సా ,మహారాష్ట్ర ప్రభుత్వాలు కూడా కులాల వారీగా జనాభా లెక్కలను తీయడానికి ప్రభుత్వ పరణంగా నిర్ణయం తీసుకున్నాయని తెలంగాణలో కూడా ప్రభుత్వం సొంతగా కులగణన చేస్తామని ప్రకటించాలనిడిమాండ్ చేశారు. ఈసమావేశంలో రాష్ట్ర నేతలు భూపేష్‌సాగర్, నీలం వెంకటేష్, కోలా జనార్ధన్, అంజి, రామకృష్ణ, దేవేందర్, శివమ్మ, రాణి శ్రీదేవి,రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

# పూలే జాతి ప్రగతికి నిత్యస్ఫూర్తి

## -ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

**హైదరాబాద్, ఏప్రిల్ 13 ప్రభాతవార్త**

మహాత్మా జ్యోతిరావుపూలే జాతి ప్రగతికి నిత్యస్ఫూర్తి అని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. గురువారం పూలే ఉత్సవ కమిటీ వైస్ చైర్మన్ శెన్‌శెట్టి విజయేంద్రసాగర్, బోయపల్లి లింగంగౌడ్, కన్వీనర్ పుట్ట యాదగిరి ఆధ్వర్యంలో పలువురు నాయకులు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌ను కలిశారు. ఈ సందర్భంగా రవీంద్రభారతిలో నిర్వహించిన జ్యోతిరావుపూలే జయంతి వేడుకల వివరాలను ఎమ్మెల్యేకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌కు పూలే జయంతి వేడుకల జ్ఞాపిక, శాలువతో ఘనంగా సత్కరించారు.

# 16న పి.వి.నరసింహారావు తెలంగాణ పశు వైద్య విశ్వవిద్యాలయం 4వ స్నాతకోత్సవం

## -గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర్ రాజన్ చేతులు మీదుగా విద్యార్థులకు పట్టాలు ప్రదానం

**మైలార్‌దేవ్‌పల్లి,ఏప్రిల్ 13 ప్రభాతవార్త :**

పి.వి.నరసింహరావు తెలంగాణ పశు వైద్య విశ్వవిద్యాలయం 4వ స్నాతకోత్సవం ఈ నెల 16వ తేదీ ఆదివారం ఉదయం 9.30 గంటలకు రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఘనంగా జరుగుతుందని విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ వి.రవీందర్‌రెడ్డి తెలిపారు.గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర గవర్నర్,విశ్వ విద్యాలయ ఛాన్సలర్ డాక్టర్. తమిళిసై సౌందర్ రాజన్ కార్యక్రమానికి విచ్చేయనున్నారని ఆయన తెలిపారు.గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ విద్యార్థులకు పట్టాలు ప్రధానం చేయనున్నారని ఆయన తెలియజేశారు.రాజస్థాన్ యూనివర్శిటి ఆఫ్ వెటర్నరీ అండ్ యానిమల్ సైన్సెస్ ఉప కులపతి ప్రొఫెసర్ సతీష్ కుమార్ గార్గ్ ముఖ్య అతిథిగా విచ్చేసి సా ్నతకోత్సవ ఉపన్యాసం ప్రసంగిస్తారని ఆయన తెలిపా రు.2022వ సంవత్సరంలో ఉత్తీర్ణులైన132 పశువైద్యం,24 డైరీ టెకా ్నలజీ,23 ఫిషనరీ సైన్సెస్, 49 పి.జి. 11 పిహెచ్‌డితో పాటు 239 మంది విద్యార్థులు పట్టాలు అందుకోనున్నారని ఆయన తెలియజేశారు.వివిధ రంగాలలో అత్యుత్తమ ప్రతభ కనపరిచిన 7 మంది విద్యార్థులకు బంగారు పతకాలను ప్రధానం చేయనున్నామని ఆయన తెలిపారు.ఈ ఎనిమిదిన్నర సంవత్సరాల యువ విశ్వవిద్యాలయం వరంగల్‌లోని మామ్‌నూర్‌లో కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్సు మరియు పెబ్బైర్‌లో కాలేజ్ ఆఫ్ ఫిషరీ సైన్సు అనే రెండు కొత్త కళాశాలలను స్థాపించటం,సిద్దిపేట్‌లో మరో కొత్త వెటర్నరీ కాలేజీ ప్రారంభించటానికి ఏర్పాట్లు చేయటం,రాష్ట్ర గవర్నర్ సహకారంతో గిరిజన వర్గాల కోసం పోషకాహార కార్యచరణ ప్రణాళికలో భాగంగా ఆదిమ గిరిజన గ్రూపు రైతులకు పెరటి కోళ్ల మెరుగైన రకం పంపిణీ,ఇన్విటో ఫెర్టిలైజేషన్ (ఐవిఎఫ్) ఎంబ్రియా ట్రాన్స్‌ఫర్ టెక్నాలజీని ఉపయోగించి 264 పిండాలను, 4 సాహివాల్ దూడలను విజయవంతంగా ఉత్పత్తి చేయటం, పశువుల చికిత్స కోసం సూపర్ స్పెషాలిటీ పశు వైద్య ఆసుపత్రి ద్వారా క్లినికల్ కాంప్లెక్స్‌లో ఎక్స్‌రే యూనిట్‌తో సహా అల్ట్రా స్కానింగ్,ఎండో స్కోపీ, డయాలసిస్ యూనిట్ వంటి అత్యాధునిక సౌకర్యాలు ఏర్పాటు చేయటం వంటి ఎన్నో పరిశోధన మరియు రైతు విస్తరణలతో యూనివర్శిటి తెలంగాణ పాడి పశువుల సంరక్షణకై తనవంతు పాత్ర పోషిస్తున్నదని ఉప కులపతి ప్రొఫెసర్ వి.రవీందర్ రెడ్డి వెల్లడించారు.ఈ విలేకర్ల సమావేశంలో రిజిస్ట్రార్ ఎస్.టి. విరోజి రావు, డీన్.టి.రఘునందన్,కరట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ వి.గోపాల్‌రెడ్డితో పాటు పలువురు యూనివర్శిటి ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో విశ్వ విదా ్యలయం ఉపకులపతి ప్రొఫెసర్ వి.రవీందర్‌రెడ్డి మాట్లాడుతున్న దృశ్యం



నాలా పూడికతీత పనులను పరిశీలిస్తున్న శ్రీలత శోభన్‌రెడ్డి

## పెద్దనాలా పూడికతీత పనులను త్వరగా పూర్తి చేయాలి

### డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి

**తార్నాక, ఏప్రిల్ 13 ప్రభాతవార్త:** లాలాపేట్ పెద్దనాలా పూడిక తీతపనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను నగర డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి ఆదేశించారు. ఈ మేరకు గురువారం బీఆర్ఎస్ కార్మిక విభాగం అధ్యక్షులు మోతె శోభన్‌రెడ్డి, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి డిప్యూటీ మేయర్ పూడిక తీత పనులను పర్యవేక్షించారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని పనులను త్వరితగతిన చేయించాలని డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి సూచించారు. స్థానిక సమస్యలపై అధికారులు వెంటనే స్పందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈ వెంకటేష్‌తో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలి: సిఐ శ్రీనివాస్‌రావు



ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రావును సన్మానించిన నాయకులు

**మెహిదీపట్నం, ఏప్రిల్ 13, ప్రభాతవార్త :** ప్రతి ఒక్కరు సేవా కలిగి ఉండాలని టప్పాచబుత్ర ఇన్‌స్పెక్టర్ సున్నం శ్రీనివాస్‌రావు అన్నారు. స్వర్గీయ దేవర కరుణాకర్ జ్ఞాపార్థంగా బిజెపి రాష్ట్ర నాయకులు దేవర శ్రీనివాస్, బిజెపి యువనాయకులు దేవర వంశీ ఆధ్వర్యంలో గురువారం కార్వాన్ కుల్సుంపుర ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన తాగు నీటి వాటర్‌ట్యాంక్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం సున్నం శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. పేదవారికి సేవ చేయడంలోనే నిజమైన ఆనందం కలుగుతుందన్నారు. దేవర శ్రీనివాస్ మాట్లాడుతూ.. గుడిమల్కాపూర్ డివిజన్ కార్పొరేటర్ స్వర్గీయ దేవర కరుణాకర్ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని, అందులో భాగంగానే ప్రభుత్వ పాఠశాలలో వాటర్ ట్యాంక్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా బోజగుట్ట వివేకానంద నగర్‌లో 43వ భారతీయ జనతా పార్టీ ఆవిర్బావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిజెపి రాష్ట్ర నాయకులు దేవర శ్రీనివాస్, యువనాయకులు దేవర వంశీ పాల్గొని పార్టీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సుదర్శన్, ఉపాధ్యాయులు సునీత, మల్లేష్ బిజెపి నాయకులు నామయాదగిరినేత, సందేశ్ యాదవ్, సుధాకర్ యాదవ్, శ్రీకాంత్ సాగర్, అనీల్ కుమార్, మహిపాల్ సాగర్, ప్రభు పూజారి, వెంకటేష్, నాగరాజు, నర్సింహ్మా, వెంకటప్పలు పాల్గొన్నారు.

## ట్రాన్స్‌జెండర్లకు నిత్యావసర వస్తువుల కిట్ల పంపిణీ

**నాచారం, ఏప్రిల్ 13 ప్రభాతవార్త:** ట్రాన్స్‌జెండర్లను ప్రజలు ఆదరించాలని బీఆర్ఎస్ నేత సాయిజన్ శేఖర్, నాచారం ఎస్సై కుమారస్వామి పేర్కొన్నారు. నాచారంలోని న్యూలైఫ్ ఫౌండేషన్ అండ్ చారిటబుల్, సోషల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పలువురి ట్రాన్స్‌జెండర్లకు నిత్యావసర వస్తువుల కిట్లను పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సాయిజన్ శేఖర్, ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు నసీం భాను మాట్లాడుతూ న్యూలైఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసర వస్తువుల కిట్లను పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ వైస్ ప్రెసిడెంట్ నశ్రీన్, ట్రాన్స్‌జెండర్స్ సఖీ నాయక్ జీ, స్వీటి నాయక్‌జీ, అఖిల్ నాయక్, అప్పు నాయక్, లవ్లీ, హర్షతో పాటు పలువురు పాల్గొన్నారు.

## టోల్‌టాక్స్ ఎత్తివేయడం అభినందనీయం : రామక్రిష్ణ

**కంటోన్మెంట్, ఏ ప్రిల్ 13 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో టోల్‌టాక్స్‌ను ఎత్తివేయడం అభినందనీయమని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు జె.రామక్రిష్ణ, బిజెపి అధికార ప్రతినిధి బి.ఎన్.శ్రీనివాస్‌లు తెలిపారు. కమర్షియల్, నిత్యవసర సరుకుల వాహనాలపై కంటోన్మెంట్ బోర్డు చెక్‌పోస్టుల వద్ద టోల్‌టాక్స్‌ను వసూల్ చేయడంతో సామాన్య ప్రజలకు భారం పడుతుందన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వ రక్షణ శాఖ టోల్‌టాక్స్‌ను పూర్తిగా ఎత్తివేయాలని గెజిట్ విడుదల చేయడంతో గురువారం పికెట్ పార్కు సమీపంలోని చెక్‌పోస్టు వద్ద ప్రధాన మంత్రి నరేంద్రమోడి చిత్రపటానికి పాలాభిషేకంచేసి సంబరాలు జరుపుకున్నారు. బిజెపి నాయకులు విజయానంద్, టోపి శంకర్, నాగభూషన్ రెడ్డి, కొమ్ముల మధు, రాపోలు మాధురి, తదితరులు పాల్గొన్నారు.

## నేడు 'బూ షర్ట్స్-బ్లూ మార్చ్'ను విజయవంతం చేయాలి

### పిడమర్తి రవి పిలుపు

**సైఫాబాద్, ఏప్రిల్ 13 ప్రభాతవార్త:** భారత రత్న డా.బి.ఆర్.అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం నగరంలో 'బూ షర్ట్స్-బ్లూ మార్చ్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని దీనిని విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర తొలి ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ పిడమర్తి రవి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ట్యాంక్‌బండ్ వద్దగల అంబేద్కర్ విగ్రహం ఎదుట ఈ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను పలు సంఘాల నేతలతో కలిసి ఆవిష్కరించారు. సాయంత్రం 4 గంటలకు బిఎన్ రెడ్డి నగర్ నుంచి ఎల్‌బి నగర్‌లోని అంబేద్కర్ విగ్రహం వరకు ఈ కవాతు కొనసాగుతుందన్నారు. గత ఐదు సంవత్సరాలు ఈ కవాతును నగరంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని, రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటిలను చైతన్యం కలిగించేందుకే ఈ మార్చ్ చేపట్టామని చెప్పారు. ఎస్సీ రిజర్వేషన్‌ల శాతాన్ని 20 శాతంకు పెంచాలని, ఇందులో మాదిగలకు 12 శాతం కల్పించాలని, బిసిలకు 50 రిజర్వేషన్‌లు కల్పించాలనే ప్రధాన డిమాండ్‌తో ఈ మార్చ్ నిర్వహిస్తున్నామన్నారు. బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్ బోరెల్లి సురేష్, నల్లాల క్రాంతి, చంద్రనాయక్, రహీం తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి : ఓం ప్రకాష్‌బిస్వా

గన్‌ఫౌండ్రి, ఏప్రిల్13ప్రభాతవార్త: కులమతాలకు అతీతకంగా ప్రజా సమస్యలను పరిష్కరించడంతోపాటు అభివృద్ధి పనులను చేపట్టడం జరుగుతుందని గన్‌ఫౌండ్రి డివిజన్ బిజెపి కార్పొరేటర్ డాక్టర్ సురేఖ ఓంప్రకాష్‌బిస్వా అన్నారు. డివిజన్‌లోని పలు బస్తీలలో ఇంటింటికి తిరిగి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గడిచిన రెండున్నర సంవత్సరాల కాలంలో డివిజన్‌లో అనేక అభివృద్ధి పనులను చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## అఫ్జల్‌గంజ్‌లో సిఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

**అఫ్జల్‌గంజ్, ఏప్రిల్ 13ప్రభాతవార్త:** నాంపల్లి నియోజకవర్గం బిఆర్ఎస్ ఇన్‌చార్జ్ సిహెచ్.ఆనంద్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అంతకుముందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విఫ్ ఎం.ఎస్. ప్రభాకర్‌రావు, బిఆర్ఎస్ నాయకులు బండిరమేష్, ప్రదీప్‌కుమార్ అగర్వాల్, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.



అమీర్‌పేటలో జరిగిన ఫ్యాషన్‌షోలో పాల్గొన్న మోడల్స్

# దేశానికే ఆదర్శం కెసిఆర్ పథకాలు

**కంటోన్మెంట్, ఏ ప్రిల్ 13 ప్రభాతవార్త:** బిజెపి నాయకుల మాటలను నమ్మి రాష్ట్ర ప్రజలు మోసపోవద్దని బిఆర్ఎస్ పార్టీ హైదరాబాద్ జిల్లా ఇన్‌ఛార్జి దాసోజ్ శ్రావన్ కుమార్, మల్కాజిగిరి పార్లమెంట్, కంటోన్మెంట్ అసెంబ్లీ ఇన్‌ఛార్జి మర్రి రాజశేఖర్ రెడ్డిలు తెలిపారు. గురువారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని పద్మశాలి కళ్యాణ మండపంలో 4వ వార్డు మాజీ బోర్డు సభ్యురాలు పనస నళిని కిరణ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి వారు ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశానికి తలమానికంగా నిలిచాయన్నారు. తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక అవినీతి గురించి కేసిఆర్ కుటుంబం పై విష ప్రచారం చేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలో బిజెపి గ్యాస్, పెట్రోల్, డిజిల్ ధరలు పెంచడంతో నిత్యవసర సరుకులు ఆకాశాన్ని అంటే విధంగా పెరుగుతున్నాయన్నారు. అటువంటి బిజెపి నాయకులను వచ్చే ఎన్నికల్లో నిలదీసి తగిన బుద్ధి చెప్పాలన్నారు. ప్రభుత్వ రంగ కార్పోరేషన్ల చైర్మన్లు డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్, గజ్జెల నాగేశ్, మన్నె క్రిషాంక్‌లు మాట్లాడుతూ కేసిఆర్ నాయకత్వంలో తెలంగాణ సుభిక్షంగా ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ విజయం సాధించి హ్యాట్రిక్ సాధించేందుకు కృషి చేయాలన్నారు. దశాబ్దాల పాటు దేశాన్ని పాలించిన కాంగ్రెస్, బిజెపిలు ప్రజలకు చేసింది ఏమి లేదన్నారు. ఈ కార్యక్రమంలో దివంగత ఎమ్మెల్యే సాయన్న కూతురు నివేదిత, బిఆర్ఎస్ నేతలు ఎన్.శ్రీగణేష్, మార్కెట్ మాజీ చైర్మన్ టీ.ఎన్.శ్రీనివాస్, మాజీ బోర్డు సభ్యులు నళిని కిరణ్, పాండు యాదవ్, లోకనాథం, భాగ్యశ్రీ, బిఆర్ఎస్ నాయకులు సి.క్రిష్ణ యాదవ్, (గొల్లకిట్టు) పెద్దాల నర్సింహ్మా, ముప్పిడి మధుకర్, సి.సంతోష్ యాదవ్, వినోద్, కట్టెల శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.





ఆత్మీయ సమ్మేళనంలో ప్రసంగిస్తున్న మర్రి రాజశేఖర్‌రెడ్డి, జిల్లా ఇన్‌ఛార్జి దాసోజ్ శ్రావన్

## ప్రజలను మోసం చేయొద్దు

### కార్పొరేటర్ మహాలక్ష్మి

**హైదరాబాద్, ఏప్రిల్ 13 ప్రభాతవార్త:** బస్తీ బాట కార్యక్రమం కేవలం కంటి తుడుపు చర్యగా చేపట్టి బస్తీవాసులను మోసం చేయరాదని హిమాయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ జి.మహాలక్ష్మి రామన్‌గౌడ్ హెచ్చరించారు. గతంలో కూడా ప్రభుత్వం బస్తీ బాట కార్యక్రమాన్ని డివిజన్‌లో చేపట్టి బస్తీకి చేసింది ఎమిలేదని ఆరోపించారు. గురువారం డివిజన్‌లోని ముత్యాలబాగ్‌లో జిహెచ్ఎంసి అధికారి ప్రవీణ్‌కుమార్ బస్తీ బాట కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్బంగా ఆమె మాట్లాడారు. గతంలో జరిగిన బస్తీ బాట కార్యక్రమంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఆనేక సమస్యలను శాఖల వారిగా నివేదిక తయారు చేసి అధికారులకు అందజేయడం జరిగిందని, అందులో కనీసం పది శాతం వంతు పనులను కూడా పూర్తి చేయలేదని ఆమె ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం తమ వంతు బాధ్యతగా పూర్తి చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు నర్సింగ్‌గౌడ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ

**హైదరాబాద్, ఏప్రిల్ 13 ప్రభాతవార్త:** అలీకేఫ్ చౌరస్తాలోని ఎస్ఆర్‌జి ఫంక్షన్ హాల్లో గురువారం జరిగిన కార్యక్రమంలో అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ 282 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి ఒక లక్షా 116 రూపాయల చొప్పున 2,82,32,712 రూపాయల షాది ముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదింటి ఆడబిడ్డల పెండ్లి తల్లిదండ్రులకు భారం కాకూడదనే ఉద్దేశ్యంతోనే సిఎం కెసిఆర్ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పథకమే కళ్యాణలక్ష్మి, షాదిముబారక్ అని చెప్పారు. ఈ పథకం వల్ల ఎంతో మంది పేదలు లబ్ధిపొందుతున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌ఓ లలిత, డిప్యూటి ఎంఆర్‌ఓ శ్రీనివాస్, సనీయర్ అసిస్టెంట్‌లు పుష్పలత, అరుణ, ఆర్ఐలు రాము, శాబీర్ పాల్గొన్నారు.

## సచివాలయానికి అంబేద్కర్ పేరుపెట్టడాన్ని స్వాగతిస్తున్నాం

### టిఎస్ జేఏసీ చైర్మన్ మందాల భాస్కర్, డా. ఎల్లల దత్తాత్రేయ

**తార్నాక, ఏప్రిల్ 13 ప్రభాతవార్త:** నూతన సచివాలయానికి అంబేద్కర్ పేరుపెట్టడం, ట్యాంక్ బండ్ వద్ద అంబేద్కర్ భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడాన్ని తాము సంపూర్ణంగా స్వాగతిస్తున్నామని టీఎస్ జేఏసీ చైర్మన్ మందాల భాస్కర్, డా. ఎల్లల దత్తాత్రేయ పేర్కొన్నారు. అంబేద్కర్ భారీ విగ్రహం ఏర్పాటు, సచివాలయం పేరు అంబేద్కర్ పేరును పెట్టడాన్ని స్వాగతిస్తూ సీఎం కేసీఆర్‌కు ఓ.యూలో కృతజ్ఞత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ తీసుకున్న రెండు నిర్ణయాలు చరిత్రలో నిలిచిపోతారని కొనియాడారు. బీజేపీ రాజ్యాం గాన్ని మార్చేకుట్ర చేస్తుందని ఆరోపించారు. ఇప్పటికైనా సీఎం కేసీఆర్‌ను ఆదర్శంగా తీసుకొని పార్లమెంట్‌కు అంబేద్కర్ పేరుపెట్టాలని వారు డిమాండ్ చేశారు. నగరంలో జరిగే అంబేద్కర్ మహా విగ్రహ ఆవిష్కరణకు పెద్ద సంఖ్యలో విద్యార్థులు, ప్రజలు వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా ట్రైబల్ జేఏసీ చైర్మన్ రవీందర్ నాయక్, జేఎస్టీయూ జేఏసీ చైర్మన్ జగన్, బీసి విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు రఘు, అంసా నాయకులు, నామ సైదులు, కొప్పుల అర్జున్, సురేష్ నాయక్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహావిష్కరణకు భారీగా తరలి రావాలి

**నార్సింగి, ఏప్రిల్ 13 ప్రభాతవార్త :** రాష్ట్ర రాజధాని హైదరాబాద్ మహానగరంలో సచివాలయం ముందు ఏర్పాటు చేసిన 125.అడుగుల అతిపెద్ద అబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ వేడుకకు గండిపేట్ మండలం నుంచి బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి రావాలని ఆ పార్టీ మండల అధ్యక్షులు రామేశ్వరం నర్సిహ్మా పేర్కొన్నారు. అంటరాని తనంను రూపుమాపేందుకు, సమానత్వ సాధన కోసం రాజ్యాంగంలో అనేక సంస్కరణలు పొందు పరిచిన మహానేత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని పేర్కొన్నారు. అంబేద్కర్ దూర దృష్టి వల్లనే విద్య, వైద్యం, ఉద్యోగం, రాజకీయాలలో సమాజంలో అణగారిన వర్గాలకు చెందిన వారికి అవకాశాలు దక్కుతున్నాయన్నారు. నేడు సచివాలయం వద్ద సీఎం కేసీఆర్ చేతుల మీదుగా అంబేద్కర్ విగ్రహంను ఆవిష్కరిస్తున్నారని, ఈ వేడుకలకు భారీగా తరలి రావాలని నర్సిహ్మా కోరారు.



మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసిన గోషామహల్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇన్‌చార్జ్ నంద కిషోర్ వ్యాస్ బిలాల్

## బిఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి

### నందకిషోర్ వ్యాస్ బిలాల్

**గోషామహల్, ఏప్రిల్ 13ప్రభాతవార్త:** గోషామహల్ నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజల సహకారంతోపాటు బిఆర్ఎస్ ఉద్యమ నాయకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో పార్టీని మరింత బలోపేతం చేస్తానని నూతనంగా నియమితులైన గోషామహల్ నియోజక వర్గం బిఆర్ఎస్ఇన్‌చార్జ్ నందకిషోర్ వ్యాస్ (బిలాల్)అన్నారు. మంత్రి క్యాంపు కార్యాలయంలో తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి బోకె అందచేసి శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ ప్రదీప్‌కుమార్, పప్పుసింగ్ పాల్గొన్నారు.

# సిఎం కెసిఆర్‌ది ఉక్కు సంకల్పం

### ఎమ్మెల్సీ ప్రభాకర్‌రావు

**మెహిదీపట్నం, ఏప్రిల్ 13, ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి కేసీఆర్‌ది ఉక్కు సంకల్పమని, ఏదైనా అనుకుంటే సాధించే వరకు వదలడని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ ఎం.ఎస్.ప్రభాకర్‌రావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, రాష్ట్రంలో భారతరాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 125 అడుగుల విగ్రహం ఏర్పాటు వరకు ప్రతి విషయంలోనూ కేసీఆర్‌ది ఉక్కు సంకల్పమేనన్నారు. నగరంలో 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేసినందుకు గాను నాంపల్లి నియోజకవర్గ సీనియర్ దళిత నాయకులు, గుడిమల్కాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సంజయ్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం గుడిమల్కాపూర్ డివిజన్ అంబేద్కర్ రిటైల్ మార్కెట్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ ఎం.ఎస్.ప్రభాకర్‌రావు ముఖ్య అతిథిగా హాజరై అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన దేశానికి, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి చేసిన సేవలను కొనియాడారు. దళితుల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో దళితుల కోసం దళిత బంద్ పథకాన్ని ప్రవేశపెట్టి వారిని ఆర్థికంగా బలోపేతం చేస్తున్నది సీఎం కేసీఆర్ అన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాంపల్లి, కార్వాన్ నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు ఆనంద్‌కుమార్‌గౌడ్, ఠాకూర్ జీవన్‌సింగ్, గుడిమల్కాపూర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ బంగారి ప్రకాష్, గుడిమల్కాపూర్ మార్కెట్ సెక్రటరీ ఎన్.అపర్ణ నాయకులు తూముకుంట అరుణ్‌కుమార్, కోదూరు శ్రీధర్‌సాగర్, రాజు, లక్ష్మినారాయణ, యాదయ్య, సత్యం గౌడ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## దేవాలయాల అభివృద్ధికి సహకరిస్తా

### బిజెపి నేత వడ్డేపల్లి రాజేశ్వర్‌రావు

**యూసుఫ్‌గూడ, ఏప్రిల్ 13, ప్రభాతవార్త :**

దేవాలయాలను అభివృద్ధి పరిచేందుకు తనవంతు సహాయ సహకారాలను ఎపుడు అందిస్తామని బిజెపి సినియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరావు అన్నారు. గురువారం వివేకానందనగర్ కాలనీలోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో ఆలయ అభివృద్ధికోసం రూ.2లక్షల 16వేలను తండ్రి వడ్డేపల్లి నర్సింగరావు పేరు మీద ఆలయ కమిటీ చైర్మన్ పులిగోళ్ల శ్రీనువాస్‌యాదవ్ అందజేశారు. కార్యక్రమం లో ఆలయ కమిటి సభ్యులు కాయితీ యాదవరెడ్డి, లక్ష్మణ్‌చారి, గుడిపల్లిగోపి, బొంతు హరికృష్ణ, రోనంకి జగన్నాధం, శ్రీనువాస్, చిలకల కృష్ణారెడ్డి, చెల్లయ్య, కేశవరావు, విజయ్, శ్రావణ్, సాయిచందు, తదితరులు పాల్గొన్నారు.



అగ్నిమాపకదళ వారోత్సవాల గోడపత్రికను ఆవిష్కరిస్తున్న తలసాని

## అగ్నిప్రమాదాల నివారణపై ప్రజలను

## చైతన్య పర్చాలి :మంత్రి తలసాని

**అడ్డగుట్ట,ఏ ప్రిల్ 13 ప్రభాతవార్త:** అగ్నిప్రమాదాల నివారణపై ప్రజలను అప్రమత్తం చేయాలని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమలు, సినిమాటోగ్రాఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. గురువారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని తలసాని నివాసంలో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌తో కలిసి ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే జాతీయ అగ్నిమాపకదళ వారోత్సవాల గోడపత్రిక, కరపత్రాలను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడం, అగ్నిప్రమాదాల నివారణకు తగు చర్యలు తీసుకోవడంపై బస్తీలలో అవగాహన, విస్తృత ప్రచారాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో అగ్నిమాపక అధికారులు మధుసూదన్ రావ్, ధనుంజయరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, మోహన్‌రావ్ పాల్గొన్నారు.

### అంబేద్కర్ విగ్రహావిష్కరణకు తరలి రావాలి

దేశంలో అత్యంత ఎత్తైన 125 అడుగుల ఎత్తులో నిర్మించిన అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సనత్‌నగర్ నియోజకవర్గం నుంచి కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి రావాలని రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సూచించారు. శుక్రవారం సచివాలయం సమీపంలో నెలకొల్పిన అంబేద్కర్ విగ్రహావిష్కరణకు ముఖ్యమంత్రి కేసిఆర్ విచ్చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు అత్తెల్లి అరుణ శ్రీనివాస్ గౌడ్, శేషుకుమారి తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి : కొంతం దీపిక

**కంటోన్మెంట్, ఏ ప్రిల్ 13 ప్రభాతవార్త:** మోండా డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నా మని డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక తెలిపారు. గురువారం రైల్ నిల యం అంబేద్కర్ నగర్‌లో పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసు కున్నారు. రోడ్లు, డ్రైనేజీ, అస్తవ్యస్థంగా ఉన్నాయని స్థానికులు ఆమె దృష్టికి తెచ్చారు. తన దృష్టికి తెచ్చిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి ఇంజనీర్, శ్రావంతి, బిజెపి నాయకులు చిన్నవీరయ్య, బాలమల్లేశ్ యాదవ్ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## మతసామరస్యానికి ప్రతీక పండుగలు : జంపనప్రతాప్

**కంటోన్మెంట్, ఏ ప్రిల్ 13 ప్రభాతవార్త:** పండుగలు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్ కె.రవికుమార్ అన్నారు. రంజాన్ పండుగ ను పురస్కరించుకొని బుధవారం రాత్రి కడక్‌పురాలో నిర్వహించిన ఇఫ్తార్ విందుకు వారు ముఖ్యఅతిధిగా హాజరై ప్రసంగించారు. ముస్లింలతో కలిసి రంజాన్ ఉపవాసదీక్ష విరమింపజేశారు. కార్యక్రమంలో ఎస్ఐలు యుగంధర్, అరుణ్‌యాదవ్, నాయకులు చోటూ, మౌలా పాల్గొన్నారు.

## నేడు అంబేద్కర్ జయంతి వేడుకల్లో పాల్గొనాలి

**హైదరాబాద్, ఏప్రిల్ 13 ప్రభాతవార్త:** భారతరత్న, రాజ్యాంగ నిర్మాత బి.ఆర్.అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని గురువారం హిమాయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ జి.మహాలక్ష్మీరామన్‌గౌడ్ డివిజన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె డివిజన్‌లోని ఐదు అంబేద్కర్ విగ్రహాలను బిజెపి కార్యకర్తలతో శు భ్రం చేయించడం జరిగింది. అలాగే విగ్రహాలకు అలంకరణ చేయించారు. శుక్రవారం ఉదయం డివిజన్‌లోని ఐదు ప్రాంతాలలో విగ్రహాల వద్ద జరిగే జయంతి ఉత్సవాల్లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆమె ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. అంబేద్కర్ అశయాల సాధన కోసం ప్రధాని నరేంద్రమోదీ ఎంతో కృషి చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు రామన్‌గౌడ్, నర్సింగ్‌గౌడ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహానికి గులాబీలతో పుష్పాంజలి

**సైఫాబాద్, ఏప్రిల్ 13 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం 125 అడుగులు ఎత్తుగల రాజ్యాంగ నిర్మాత బి.ఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని నిర్మించి శుక్రవారం ప్రతిష్టించనున్న సిఎం కెసిఆర్‌కు ఫుడ్ కార్పొరేషన్ ఛైర్మన్ రాజీవ్ సాగర్, వివిధ దళిత సంఘాల నేతలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు వారు ట్యాంక్‌బండ్ వద్దగల అంబేద్కర్ విగ్రహానికి వందల కిలోల గులాబి పూలతో పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా రాజీవ్‌సాగర్, మాల మహానాడు జాతీయ అధ్యక్షడు జి. చెన్నయ్య మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేని విధంగా 125 అడుగుల ఎత్తుగల అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి, తెలంగాణ రాష్ట్ర సచివాలయంకు అంబేద్కర్ పేరు పెట్టడం గొప్ప పరిణామమన్నారు. చరిత్ర ఉన్నంత కాలం కెసిఆర్ పేరు నిలిచిపోతుందన్నారు.

## గుండెపోటుతో గుర్తు తెలియని వ్యక్తి మృతి

**పేట్‌బషీరాబాద్, ఏప్రిల్13 ప్రభాతవార్త:** గుండెపోటుతో వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే..గండిమైసమ్మకు చెందిన గుర్తుతెలియని వ్యక్తి మైసమ్మగూడలోని మహేంద్ర రెడ్డి అనే వ్యక్తి ఇంటి పనుల నిమిత్తం కూలీ మాట్లాడుకొని పని చేస్తుండగా అకస్మాత్తుగా గుండె నొప్పి వస్తుందని చెప్పి అక్కడికక్కడే మృతిచెందాడు. దీంతో మహేంద్రరెడ్డి పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు.

**BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR RED HILLS AT HYDERABAD**
**ABR/CF/No: 531 OF 2022**
BETWEEN:
**M/S MARGADARSI CHIT FUND PRIVATE LIMITED,** TRIMULGHERRY BRANCH, Represented By Its Foreman/Branch Manager. **...Disputant**
AND
**Mr Gorla Vidya Sagar Reddy & Others. ...Opponents**
To
Opponent No:01: **01. Mr Gurla Vidya Sagar Reddy** S/o G Bhaskar Reddy, Dob: 26/08/1992, Occ: Proprietor, M/s Sri Kamakshi Enterprises. Kirana/ Milk Shop, At D.No: 49-128/9/1/A, Ground Floor, Near Ammabhavani Temple, Kalpana Society, Ganesh Nagar, Chinthal, Hyderabad.-500054.
Opponent No:02: **02. Mr Gorla Chaitanya Reddy** S/o G Bhaskar Reddy, Dob: 30/08/1982, W/As: Deputy Manager, Emp. Code: 103211, Hetero Drugs Limited, Unit-1, Bonthapally, Jinnaran, Medak Dist-502319. R/o F No:101, Manikanta Nilayam, Ranga Nagar, Chintal, Hyderabad-500054.
Opponent No:03: **03. Mr Manam Hazarathiah** S/o M Vengaiah, Dob: 08/06/1981, W/As: Asst Manager, Emp.Code: 101142, Hetero Drugs Limited, Unit-1, Bonthapally, Jinnaram, Medak Dist-502319. R/o F NO: 401, V V S Residency, Bhagya Lakshmi Colony, Quthubullapur, R R Dist-500054.
Opponent No:04: **04. Mr Puchakayala Ravinder Reddy** S/o P Raghupathi Reddy, Dob: 01/01/1979, W/As: Senior Executive, Emp. Code: 104858, Department: Manufacturing, Production, Hetero Drugs Limited, Unit-I, Bonthapally, Jinnararn, Medak Dist-502319. R/o Plot No.49, H.No: 2-7-2, Hanuman Nagar, Suraram, Hyderabad-500055.
Opponent No:05: **05. Mr Gorla Bhaskar Reddy** S/o G Seetharami Reddy, Dob: 01/01/1960, Occ: Farmer, H.No: 2-25, Near Ankamma Temple, Vennachedu, Venkatapuram, Khanman Dist-507164.
Please Take Notice That The Above Dispute is Filed Against You For Recovery of **Rs.48,569/-** (Fourty Eight Thousand Five Hundred And Sixty Nine Rupees Only) And The Same Is Posted To **29.04.2023** For Your Appearance Before The Office Of Deputy Registrar Of Chits/Arbitrator.Red Hills, Hyderabad, At 11.00 A.M. If You Fail to Attend The Office Of Deputy Registrar Of Chits/Arbitrator. Red Hills, On That Day The Matter Will Be Heard And Decided Exparte.
//BY ORDER OF THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR//
**Sd/- FOREMAN AND BRANCH MANAGER OF DISPUTANT COMPANY**

**BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR RED HILLS AT HYDERABAD**
**ABR/CFNo: 596 OF 2022**
BETWEEN:
**M/S MARGADARSI CHIT FUND PRIVATE LIMITED,** TRIMULGHERRY BRANCH, Represented By Its Foreman/ Branch Manager. **...Disputant**
AND
**Mr. Mamidi Srinivas & Others. ...Opponents**
To
Opponent No: 01:
**01. Mr Mamidi Srinivas** S/o Mamidi Laxminarsaiah, Dob: 01/02/1977, Occ: Prop, M/s New Vaishnavi Homes Appliances At P.No: 175/182, Vasavi Nagar, Main Road, Kharkana, Secunderabad-500015. R/o H.No: 11-29/8/220, BJR Colony, Jammigadda, Kapra, Medchal Malkajgiri Dist-500062.
Opponent No: 02: **02. Mrs Singam Sujatha** W/o Singan Venkatanarayana, Dob: 06/09/1977, Occ: Prop, M/s Arun Kirana General Stores, P.No: 223, BJR Colony, Jammigadda, Kapra, Medchal Malkajgiri Dist-500062.
Opponent No: 03: **03. Mr Kummari Srinivas** S/o Kummari Narsaiah, Dob:01/10/1979, Occ: Prop, M/s Srinivasa Mineral Water, D.No:1-1-29/9/62, Bhagath Nagar, Jammigadda, Kapra, Medchal Malkajgiri Dist-500062.
Opponent No: 04: **04. Mr Pandiri Srinivasulu** S/o Pandiri Ramulu, Dob: 03/05/1976, Occ: Prop, M/s Balaji Kirana & General Stores And Flour Mill, Plot No:55/1, KNR Colony, Ambedkar Nagar, Shmeerpet, Kapra, Medchal Malkajgiri Dist-500062., R/o H.No:20-197/96/12, KNR Colony, Ambedkar Nagar, Jawahar Nagar, Shameerpet, Medchal Malkajgiri Dist-500078.
Opponent No: 05: **05. Mr Mamidi Somesh** S/o Mamidi Laxminarsaiah, Dob: 15/02/1982, Occ: Joint Property Holder, H.No: 18-73/36/1/13, NTR Colony, Ambedkar Nagar, Jawahar Nagar, Shmeerpet, Medchal Malkajgiri Dist-500078., R/o H.No: 29-391/212, Vajpai Nagar, Neredmet, Hyderabad-500056.
Please Take Notice That The Above Dispute Is Filed Against You For Recovery Of **Rs.6,66,844/-** (Six Lakhs Sixty Six Thousand Eight Hundred And Fourty Four Rupees Only) And The Same Is Posted To **29.04.2023** For Your Appearance Before The Office Of Deputy Registrar Of Chits/Arbitrator.Red Hills, Hyderabad, At **11.00 A.M.** If You Fail to Attend The Office Of Deputy Registrar Of Chits/Arbitrator.Red Hills, On That Day The Matter Will Be Heard And Decided Exparte.
//BY ORDER OF THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR//
**Sd/- FOREMAN AND BRANCH MANAGER OF DISPUTANT COMPANY**

**BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR RED HILLS AT HYDERABAD**
**ABR/CFNo: 613 OF 2022**
BETWEEN:
**M/S MARGADARSI CHIT FUND PRIVATE LIMITED,** TRIMULGHERRY BRANCH, Represented By Its Foreman/ Branch Manager. **...Disputant**
AND
**Mrs Chintha Aruna & Others. ...Opponents**
To
Opponent No: 01:
**01. Mrs Chintha Aruna** W/o Ch Yellaiah, Dob: 03/04/1972, Occ: House Wife, R/o H.No: 9-34, Ambedkar Nagar, Jawahar Nagar, Kapra, Malkajgiri, Medchal Malkangiri Dist-500087.
Opponent No: 02:
**02. Mr Chintha Yellaiah** S/o Ch Sri Sailu, Dob: 10/05/1968, Occ:Prop, Chintha Painting Coats, D.No.9-34, Ambedkar Nagar, Jawahar Nagar, Kapra, Malkajgiri, Medchal Malkajgiri Dist-500087.
Opponent No: 03:
**03. Mr Sandupatla Anjaneyulu** S/o S Yadagiri, Dob:01/02/1985, W/As Khalasi Helper, Emp.Code: 2421E120851, South Central Railway Coaching Depo, Bhoiguda, Secunderabad-500003., R/o H.No:24/2, Fathe Shapur, Raghunath Pally, Jangaon-506244.
Opponent No: 04:
**04. Mr Chityala Ramesh** S/o Ch Narsimha, Dob:20/06/1969, W/As Jr. Asst, Emp. Code: 2576409, Govt High School, Lalapet, Secunderabad-500003. R/o H.No: 17-3/29, Dammaiguda,, Nagaram, Malkajgiri, Medchal Malkajgiri Dist-500062.
Please Take Notice That The Above Dispute Is Filed Against You For Recovery Of **Rs.2,60,492/-** (Two Lakhs Sixty Thousand Four Hundred And Ninty Two Rupees Only) And The Same Is Posted To **29.04.2023** For Your Appearance Before The Office Of Deputy Registrar Of Chits/Arbitrator.Red Hills, Hyderabad, At **11.00 A.M.** If You Fail to Attend The Office Of Deputy Registrar Of Chits/Arbitrator.Red Hills, On That Day The Matter Will Be Heard And Decided Exparte.
//BY ORDER OF THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR//
**Sd/- FOREMAN AND BRANCH MANAGER OF DISPUTANT COMPANY**

**BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR RED HILLS AT HYDERABAD**
**ABR/CFNo: 614 OF 2022**
BETWEEN:
**M/S MARGADARSI CHIT FUND PRIVATE LIMITED,** TRIMULGHERRY BRANCH, Represented By Its Foreman/ Branch Manager. **...Disputant**
AND
**Mr. Anumula Ramesh Reddy & Others. ...Opponents**
To
Opponent No: 01: **01. Mr Anumula Ramesh Reddy** Slo A Linga Reddy. Dob:12/03/1988. Occ:Prop. M/s Shiva Sai Printers, D.No:1-7-207, Kamala Nagar, ECIL, Hyderabad-500062. R/o P.No:59 Sonia Gandhi Nagar, Kushaiguda, Hyderabad-500062.
Opponent No: 02: **02. Mr Pasham Jaipal Reddy** S/o P Kista Reddy, Dob: 04/09/1985. Occ: Prop, Chaitra Marketing, Plot No:3 & 4 Part, Subhodaya Nagar Colony, Kushaiguda, Hyderabad-500062.
Opponent No: 03: **03. Mr Mokalla Muthyam Reddy** S/o M Venkat Reddy, Dob: 05/04/1969, Occ:Proprietor, M/s Kushaiguda Food Industries, Plot No. 3 # 4, Subhodaya Nagar Colony, Kushaiguda, Hyderabad-500062.
Opponent No: 04: **04. Mr Anumula Rama Krishna Reddy** S/o A Linga Reddy, Dob: 01/06/1982, Occ: Partner, M/s Lakshmi Engineering Works, P.No: D-27, EC Complex, Kushaiguda, Hyderabad-500062., R/o P.No: 59, Sonia Gandhi Nagar, Hyderabad-500062.
Opponent No: 05: **05. Mr Polam Srinivas Reddy** S/o P Keshava Reddy, Dob: 06/03/1971, Occ:Prop, M/s P S R Enterprises, (Transport In School Buses), D.No:1-10-28/232/33, Shiva Sai Nagar, Kushaiguda, Hyderabad-500062.
Opponent No: 06: **06. Mrs Polam Laxmi** W/o P Srinivas Reddy, Dob: 21/02/1972, Occ:Property Holder, R/o H.No:1-10-28/232/33, Shiva Sai Nagar, Kushaiguda, Hyderabad-500062.
Please Take Notice That The Above Dispute Is Filed Against You For Recovery Of **Rs.45,218/-** (Fourty Five Thousand Two Hundred And Eighteen Rupees Only) And The Same Is Posted To **29.04.2023** For Your Appearance Before The Office Of Deputy Registrar Of Chits/Arbitrator.Red Hills, Hyderabad, At **11.00 A.M.** If You Fail to Attend The Office Of Deputy Registrar Of Chits/Arbitrator.Red Hills, On That Day The Matter Will Be Heard And Decided Exparte.
//BY ORDER OF THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR//
**Sd/- FOREMAN AND BRANCH MANAGER OF DISPUTANT COMPANY**

**BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR RED HILLS AT HYDERABAD**
**ABR/CFNo: 618 OF 2022**
BETWEEN:
**M/S MARGADARSI CHIT FUND PRIVATE LIMITED,** TRIMULGHERRY BRANCH, Represented By Its Foreman/ Branch Manager. **...Disputant**
AND
**Mr. Maggidi Rajender & Others. ...Opponents**
To
Opponent No: 02:
**02. Mr Kurakula Yadaiah** S/o K Narsimha, Dob: 10/08/1987, Occ: agencies Commission Basis, In Herbal Life International India Pvt Ltd, H.No:5-2-13/25, Saheb Nagar, Vanasthalipuram, Hayath Nagar, R.R.Dist-500070.
Opponent No: 04:
**04. Mr Byreddy Shekar Reddy** S/o B Shankar Reddy, Dob: 15/10/1981, Occ: agencies Commission Basis, In Herbal Life International India Pvt Ltd., H.No: 4-9-552/8, Plot No.33, Sri Venkateswara School, Vinayak Nagar Colony, Hayath Nagar, R.R.Dist-500070.
Please Take Notice That The Above Dispute Is Filed Against You For Recovery Of **Rs.29,763/-** (Twenty Nine Thousand Seven Hundred And Sixty Three Rupees Only) And The Same Is Posted To **29.04.2023** For Your Appearance Before The Office Of Deputy Registrar Of Chits/ Arbitrator. Red Hills, Hyderabad, At **11.00 A.M.** If You Fail to Attend The Office Of Deputy Registrar Of Chits/ Arbitrator. Red Hills, On That Day The Matter Will Be Heard And Decided Exparte.
//BY ORDER OF THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR//
**Sd/- FOREMAN AND BRANCH MANAGER OF DISPUTANT COMPANY**

**BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR RED HILLS AT HYDERABAD**
**ABR/CFNo: 529 OF 2022**
BETWEEN:
**M/S MARGADARSI CHIT FUND PRIVATE LIMITED,** TRIMULGHERRY BRANCH, Represented By Its Foreman/ Branch Manager. **...Disputant**
AND
**M/s Divya Jyothi Shopping Mall Rep By Its Prop Mrs Y Manjula & Others. ...Opponents**
To
Opponent No: 01:
**01. M/s Divya Jyothi Shopping Mall** Rep By Its Prop Mrs Y. Manjula W/o Y.Peraiah. Dob: 03/06/1979, (Now Known As Sri Skandagiri Silks), Malkajgiri X Roads, Malkajgiri, Hyderabad-500047. Ro Flat No.6, D.No.4-271, 1st Floor, Sahithya Apartments, Geetha Nagar, Malkajgiri, Hyderabad-500047.
Opponent No: 03:
**03. Mr Yadala Peraiah** S/o Yadala Sarvadhamudu, Dob: 01/08/1977, Occ:Showroomn Incharge, M/s Sri Skandagiri Silks, Malkajgiri 'X' Roads, Malkajgiri, Hyderabad-500047. R/o Flat No.6, D.No.4-271, 1st Floor, Sahithya Apartments, Geetha Nagar, Malkajgiri, Hyderabad-500047.
Opponent No: 05:
**05. Mr Sampath Ravi** S/o Kunnavakam Elayavalli Sampath, Dob: 19/11/1965, Occ: Proprietor, M/s Gokul Catereks (Catering Business), R/o H.No. 5-2, Geetha Nagar, Malkajgiri, Hyderabad-500047.
Please Take Notice That The Above Dispute Is Filed Against You For Recovery Of **Rs.14,80,557/-** (Fourteen Lakhs Eighty Thousand Five Hundred And Fifty Seven Rupees Only) And The Same Is Posted To **29.04.2023** For Your Appearance Before The Office Of Deputy Registrar Of Chits/Arbitrator. Red Hills, Hyderabad, At **11.00 A.M.** If You Fail to Attend The Office Of Deputy Registrar Of Chits/Arbitrator. Red Hills, On That Day The Matter Will Be Heard And Decided Exparte.
//BY ORDER OF THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR//
**Sd/- FOREMAN AND BRANCH MANAGER OF DISPUTANT COMPANY**

